10 YEAR ANNIVERSARY 2014 - 2024
పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# ఇళ్ల నిర్మాణాల పురోగతి పై సమీక్ష

**పీ.ఎం ఆవాస్ యోజన 1.0లో లబ్దిపొందిన వారికి 2.0లో అవకాశం ఉండదు**

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, అక్టోబర్ 17 :**ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో లబ్ధిపొందిన వారికి 2.0లో గృహ సంబంధిత పథకంలో అవకాశం ఉండదని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువు లోగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు.ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇతర అంశాలపై స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో గృహ నిర్మాణ శాఖ అధి కారులు, మండల లేఅవుట్ ఇన్ ఛార్జులు, ఇతర అధికారులతో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు. అధికారులు, గుత్తేదార్లు సమన్వయంతో వ్యవహరించి లేఅవుట్లలో చేపట్టిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, సొంత స్థలంలో కట్టుకునే వారు కూడా త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హితవు పలికారు. పీ.ఎం ఆవాస్ యోజన 2.0 కోసం ఆలోచిస్తూ కొంతమంది లబ్ధిదారులు ముందుకు రావటం లేదని అధికా రులు ప్రస్తావించగా స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1.0లో లబ్ధి పొందిన వారికి 2.0లో అవకాశం రాదని, మార్పులు చేర్పులు ఉండబోవని స్పష్టం చేశారు. కొత్తవారికి మాత్ర మే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు బాగా అర్థమయ్యేలా చెప్పాలని అధికారులు బాధ్యత తీసుకోవాలని, క్షేత్రస్థాయి అధికారులు క్షుణ్ణంగా విడమరిచి చెప్పాలని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను త్వరి తగతిన పూర్తి చేసుకునేలా ప్రోత్సాహం అందిం చాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదా రులను ఒప్పించాలన్నారు. ఉన్న నిధులను సద్వినియోగం చేసుకునేందుకు అందరూ చొరవ చూపాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పనుల్లో మరింత జోరు పెంచాలని, నిర్ణీత కాలంలోగా పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. రోజువారీ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పనులను చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్దేశించారు.



# వాల్మీకి మహర్షికి ఘన నివాళులు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,అక్టోబర్17:**ఆధ్యాత్మిక జ్ఞాని, తాత్వికుడు మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్,జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్,ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ బి.పద్మావతి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఐటీడీఏ కార్యాలయంలో ఐటిడిఏ పిఓ, వి.అభిషేక్,సహాయ ప్రాజెక్ట్ అధికారులు వి.ఎస్ ప్రభాకర్ రావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం రాజు

మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. మానవ జీవితానికి అనువైన విధంగా వాల్మీకి రామాయణాన్ని రచించి ఎన్నో విషయాలపై మహత్తర సందేశాన్ని అందించారని గుర్తు చేశారు.కారణ జన్ముడిగా నిలిచిన ఆయన రామాయణం నిలిచినంత కాలం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు,ఐటీడీఏ అకౌంట్ అధికారి శ్రీనివాస్ కుమార్, ఐటిడిఏ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇది నా గెలుపు కాదు సమిష్టి గెలుపు...

- నియోజకవర్గం పేరు దేశమంతా మారుమోగేలా చేసిన కూటమి నాయకులుకు,కార్యకర్తలు కి కృతజ్ఞతలు..
- నాపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంట...
- ఉక్కు సంకల్పం తో ఉక్కు పరిరక్షణ కట్టుబడి ఉన్నాను..

**గాజువాక:పెన్ పవర్,అక్టోబర్ 17**

రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ తో గెలిపించిన గాజువాక నియోజకవర్గం ప్రజల నమ్మకాన్ని తప్పకుండా నిలబెట్టుకుంట అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం వడ్లపూడి శివారు గ్రీన్ సిటీ కళ్యమండపంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నా గెలుపు సమిష్టి గెలుపు అని ఈ గెలుపు కి కృషి చేసిన కూటమి బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులకు , కార్యకర్తలకు ఋణపడి ఉంటానని నియోజకవర్గం వైపు దశమంతా చూసేలా మెజారిటీ అందించిన నియోజకవర్గం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా అని అన్నారు. రాష్ట్రం లో అత్యధిక మెజారిటీ రావటం తో పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు ఇచ్చిందని, రాష్ట్ర అధ్యక్షులు గా సముచిత స్థానం కల్పించి నియోజకవర్గం అభివృద్ధి తో పాటు రాష్ట్ర నాయకులు సమన్వయ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నాని అన్నారు. ఉక్కు పరిరక్షణ ప్రధాన అజండాగా నియోజకవర్గం లో తిరిగినని దానికి కట్టుబడి ఉన్నాని ఉక్కు కర్మాగారన్ని నాడు కాపాడిన చంద్రబాబు నాయుడు నేడు కూడా అదే దిశగా ఆలోచన తో ఉన్నారని ఉక్కు శాఖ మంత్రి ని తీసుకొని వచ్చి విశాఖ ఉక్కు ప్రాముఖ్యత వివరించమని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తల కృషి తోనే నేడు ఈ స్థానంలో ఉన్నానని నియోజకవర్గం అభివృద్ధి కి సమిష్టి గా కృషి చేద్దామని పేర్కొన్నారు. మీరు ఇచ్చిన ఈ బాధ్యతలు కి కట్టుబడి ఉన్నానని, గాజువాక నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేసిన తీరు అందరికి ఆదర్శంగా నిలిచింది అని,మీతో ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు కోసం ఎంతగానో వేచి ఉన్నానని చేసిన మేలు, కృషి, కష్టం ఎప్పటికి పోవని అందరి కష్టం నేను నేరుగా చూసానని అన్నారు. కార్యకర్తలు సైనికులు లా పని చేసిన తీరు కి ఆశ్చర్యం వేసింది అని ఇంతటి అభిమానం నా సొంతం అవ్వటం ఇంతటి మార్పు ప్రజల్లో రావటం నా అదృష్టం అని అన్నారు. ఈ నమ్మకాన్ని తప్పకుండా నిలబెట్టుకొని గాజువాక నియోజకవర్గం అభివృద్ధి లో కూటమి నాయకులు తో కలిసి ప్రథమ స్థానానికి తీసుకొని వెళ్లే బాధ్యత నాదని హామీ ఇచ్చారు.కూటమి నాయకులు,కార్యకర్తలు,ఎప్పుడు కష్టం వచ్చిన నాకు సమాచారం అందించిన కొన్ని క్షణల్లో పరిష్కారం దిశగా కృషి చేస్తానని అన్నారు.గాజువాక నియోజకవర్గం జనసేన, బీజేపీ శ్రేణులు కి ప్రత్యక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేన నియోజకవర్గం ఇంచార్జి కోన తాతరావు, బీజేపీ కన్వినర్ కే. ఎన్. ఆర్.



, కార్పొరేటర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వరద బాధితుల సహాయ నిధికి స్టైరక్స్ ఫార్మా రూ" 2.5 లక్షలు వితరణ.

**జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కి ఎండి ఎస్వి రావు తరపున చెక్ అందజేసిన వైస్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి.**



**పరవాడ(పెన్ పవర్): అక్టోబర్ 17:** వరద బాధితుల సహాయ నిధికి స్టైరెక్స్ ఫార్మా కంపెనీ యాజమాన్యం రూ" 2.5 లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. రూ "2.5 లక్షల రూపాయల చెక్కును మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వి. రావు తరపున ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కు ఆమె కార్యాలయంలో స్వయంగా కలిసి అందజేశారు.తుఫాను విపత్తుకి విజయవాడ, పరిసర ప్రాంతాలు జలమయం అవ్వడమే కాకుండా తీవ్ర పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కొణిదెల పవన్ కళ్యాణ్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ల పిలుపుమేరకు వరద బాధితుల సహాయ నిధికి ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని కంపెనీ యాజమాన్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ పతినిధితో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు పాల్గొన్నారు.

# అక్రమంగా అనధికారికంగా విద్యుత్ తీగలు అమార్చుట నేరం

**అడవి జంతువుల కోసం మనుషుల ప్రాణాలతో చెలగాటమొద్దు**

**ఎస్ఐ అప్పలసూరి**

**స్టాఫ్ రిపోర్టర్,గూడెంకొత్తవీధి, పెన్ పవర్,అక్టోబర్ 17:** అనధికారికంగా పంట పొలాలలో అటవీ శాఖ భూములలో అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు అమార్చుట నేరమని గూడెం కొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి అన్నారు.అడవి జంతువుల విక్రయాల వ్యాపారమే లక్ష్యంగా ఇటీవల కాలంలో కొంతమంది అక్రమంగా వ్యవసాయ క్షేత్రాలలో అటవీ ప్రాంతాలలో విద్యుత్ తీగలు అమర్చి అడవి జంతువుల ప్రాణాలు బలిగొంటున్నారని ఇటువంటి కార్యకలాపాలు చట్టరీత్యా నేరమని ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జంతువుల కోసం అమార్చిన కరెంటు తీగల కారణంగా చాలామంది కరెంట్ షాక్కు గురై మరణిస్తున్నారని మానవులకు హాని కలిగించే ఇటువంటి చట్టరీత్య కార్యకలాపాలను మానుకోవాలన్నారు. అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చినట్లు సమాచారమొస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను మానుకోవాలని సూచించారు.




# ఉచిత ఇసుక గురించి మాట్లాడే అర్హత మాజీ శాసనసభ్యులుకు లేదు......

**నాటు బళ్ళు వద్ద రెండు కోట్ల రూపాయలు వసూలు చేసింది ఎవరు.?**

**నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యేపై విరుచుకుపడ్డ మాజీ జెడ్పిటీసీ కరక సత్యనారాయణ......**






**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 17):** ఉచిత ఇసుక గురించి మాట్లాడే అర్హత మాజీ శాసనసభ్యులకు లేదని మాజీ జెడ్పీటీసీ కరక సత్యనారాయణ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మండలంలో గల మాధవనగరం గ్రామంలో జరిగిన పల్లె - పండుగ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గణేష్ కు ఉచిత ఇసుక గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నర్సీపట్నం మండలం గబ్బాడ ఇసుక ర్యాంపులో అక్రమ నిల్వ చేశారన్నారు.దానిపై కూటమి ప్రభుత్వం రూ.17.50కోట్ల కాంట్రాక్టర్లపై జరిమానా విధించిందన్నారు.దాన్ని నుంచి తప్పించుకోవడానికి మాజీ ఎమ్మెల్యే గణేష్ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.నాటుబళ్ల వద్ద 150 వసూలు చేశారన్నారు.దీనిపై తాము ధర్నా చేస్తే ఈ వసూళ్లు చేయడం మానేశారన్నారు. అప్పట్లో తమ అంచనా ప్రకారం నాటుబళ్ల వద్ద 2కోట్లు వసూలు చేశారని ఆరోపించారు.ఇప్పుడు ఉచిత ఇసుక అని గణేష్ అనడం ఎంత వరకు సమాంజసమన్నారు.గత ఐదు సంవత్సరాల్లో అయ్యన్న,కొల్లు రవీంధ్ర,అచ్చెన్నాయుడు వంటి నాయకులను అరెస్టులు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు దూసుకుపోతున్నాయన్నారు. రెండు రోజుల్లో ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు.వైసీపీ నాయకులు చేసే ధర్నాలకు తాము భయపడేది లేదన్నారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసి దేవుడు,నేతల విజయ్ కుమార్,పారుపల్లి కొండబాబు, నాతవరం మాజీ ఎంపీటీసీ అప్పిరెడ్డి మాణిక్యం, వెదురుపల్లి మాజీ సర్పంచ్ పారుపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ కాసేపు నూకరాజు,మాజీ జెడ్పిటిసి రేగటి మంగ, శివలంకశ మల్లేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు గంట శ్రీనివాస్, గోవింద్,తానారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ప్రతినిధులు వస్తుంటారు.. వెళుతుంటారు

- సజ్జల రామకృష్ణారెడ్డి, వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని తక్షణమే అరెస్టు చేయాలి
- అధికారులు మాత్రం పూర్తి స్థాయిలో సర్వీస్ లో కొనసాగుతారు
- అందుకే అధికారులు బాధ్యతతో వ్యవహరిం చాలి
- చంద్రబాబు నాయుడు పై ఆధారాలు లేకుండా స్కిల్ డెవలప్మెంట్ కేసు నమోదు చేశారు
- చంద్రబాబు జైలుకు వెళ్లడంతో కొందరు ప్రాణాలు కోల్పోయారు
- ఆ ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు దిక్కెవరు?
- బాధిత కుటుంబాలకు వారే కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్
- బాధ్యతా రహితంగా వ్యవహరించిన అధికారుల నుంచి కూడా పరిహారం వసూలు చేయాలి
- అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించేందుకు స్కిల్ డెవలప్మెంట్ వ్యవహారం ఒక కేస్ స్టడీ కావాలి
- వీరు పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి తెలుగు శక్తి డిమాండ్
- ఎడిషనల్ ఎస్పి జి.ప్రేమ్ కాజల్ విశాఖ సిఐడి కార్యాలయంలో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఫిర్యాదు







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం అక్టోబర్ 17 :** విశాఖపట్నం ప్రజా ప్రతినిధులు వస్తుంటారు.. వెళుతుంటారని కానీ అధికారులు మాత్రం పూర్తికాలం సర్వీసులో కొనసాగుతుంటారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. అందుకే అధికారులు అత్యంత బాధ్యతాయు తంగా.. ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లకు తలవంచకుం డా పనిచేయాల్సి ఉందన్నారు. అప్పటి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై ఆధారాలు లేకుండా కేసు నమోదు చేయడం.. ఈ క్రమంలోనే ఆయన అరెస్టు కావడం.. తమ అభిమాన నాయకుడు కష్టాలలో ఉన్నారని ఆందోళనతో కొందరు అభిమానులు ప్రాణాలు కోల్పోవడం.. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం తదితర అంశాలపై బి.వి.రామ్ విశాఖ కేంద్ర కారాగారం సమీపం లోని పైనాపిల్ కాలనీలో ఉన్న సిఐడి కార్యాల యంలో ఎడిషనల్ ఎస్పి జి.ప్రేమ్ కాజల్ గురు వారం ఉదయం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..14 సంవ త్సరాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగిన నారా చంద్రబాబు నాయుడు పై గత ఏడాది సిఐడి అధికారులు స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ జరిగిందని కేసు నమోదు చేశారన్నారు. అయితే ఈ కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ చంద్రబా బుకు క్లీన్ చిట్ లభించిందని.. ఆయన కోసం తమకు ఆందోళన లేదన్నారు. అయినప్పటికీ చంద్రబాబు నాయుడు కోసం ఆందోళన చెంది ప్రాణాలు కోల్పోయిన ఆయన అభిమానుల కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 'సకల శాఖల' మంత్రిగా వ్యవహ రించిన సజ్జల రామకృష్ణారెడ్డి, అప్పటి ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రోత్బలంతోనే ఫిర్యాదు నమోదు కావడం.. ఆ ఫిర్యాదును ఆధారంగా చేసుకుని చంద్రబాబు నాయుడు ను సిఐడి అధికారులు అరెస్టు చేయడం ఎంతవర కు సమంజసం అన్నారు. కనీసం ఆధారాలు కూడా లేకుండా 53 రోజుల పాటు అక్రమంగా జైలులో నిర్బంధించడం ఎంత మాత్రం సరి కాదన్నారు. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ చంద్రబాబు నాయుడుకి క్లీన్ చిట్ ఇవ్వడంతో.. ఆయనకు కేసు నుంచి విముక్తి లభించింది అన్నారు. అయితే ఆయన అభిమానులు పోగొట్టుకున్న ప్రాణాలను తిరిగి ఇవ్వగలరా? అని బి.వి.రామ్ సిఐడి ని ప్రశ్నించారు. అందుకే బాధ్యతా రహితంగా వ్యవహరించిన అప్పటి సిఐడి అధికారులను, తప్పుడు కేసులు పెట్టిన వ్యక్తులను, అందుకు ప్రోత్సహించిన అప్పటి సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణా రెడ్డి, వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు సజ్జల రామకృష్ణారెడ్డి, వైయస్ జగన్మోహన్ రెడ్డి ద్వారా కోటి రూపాయలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐడి అధికారుల నుంచి కూడా బాధిత కుటుంబాలకు పరిహారం అందించాల న్నారు. అప్పుడే అధికారులు ఒళ్ళు దగ్గర పెట్టుకొని.. విధులు నిర్వహిస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తప్పుడు కేసులు నమోదు కాకుండా ఉండేందుకు.. అనేక మంది ప్రాణాలను రక్షించేందుకు స్కిల్ డెవలప్మెంట్ కేసు ఒక ఉదాహరణగా బి.వి రామ్ పేర్కొన్నా రు. వీరు పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి తెలుగు శక్తి డిమాండ్ చేశారు.ఎడిషనల్ ఎస్పి జి.ప్రేమ్ కాజల్ కలిసిన వారిలో బొడ్డేపూడి దొరబాబు, డాక్టర్ పప్పుర్ నికుంజ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి మోనటరింగ్ టీం సర్వే

కొయ్యూరు,బూదరాళ్ల, మర్రివాడ సచివాలయాల్లో సమావేశాలు



**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 17:** కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు కాబడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరుతెన్నులను అధ్యయనం చేసేందుకు గురువారం మండలంలో జాతీయస్థాయి మోనటరింగ్ టీం సభ్యులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా టీం లీడర్ సుధాకర్ నేతృత్వంలో ఏపీడి శ్రీనివాసరావు, చింతపల్లి ఏపీడి లోకేష్ మండలంలోని వెలుగు, ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు సిబ్బందితో కలిసి కొయ్యూరు, మర్రివాడ, బూదరాళ్ల గ్రామ సచివాలయాల్లో డ్వాక్రా మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు సచివాలయాల్లో వేరువేరుగా నిర్వహించిన సమావేశాల్లో టీం లీడర్ సుధాకర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, వాటర్ షెడ్ ద్వారా అమలయ్యే వివిధ పథకాలను సద్వినియోగ పర్చుకోవాలన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలను అధికారులకు దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రామ సభలను వేదికలుగా చేసుకోవాలని కోరారు. వెలుగు ద్వారా అందుతున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగపరుచుకుని డ్వాక్రా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. అలాగే సచివాలయాల సిబ్బందితో ప్రత్యేక సమావేశమైన టీఎస్ సభ్యులు, ఈ పథకాల అమలుకు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోలు శ్రీనివాస్, రాజు, వెలుగు ఏపిఎం గాంధీ, అలాగే ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, వాటర్ షెడ్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జీ.వీ.ఎం.సీ.లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు.





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం అక్టోబర్ 17.** :మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకను గురువారం విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ జీవీఎంసీ అధికారులు ఉద్యోగులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయరు, జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు రాష్ట్ర వేడుకగా ఘనంగా జీ.వీ.ఎం సీ.లో నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహర్షి వాల్మీకి బెంగాలీ నెల అశ్విన్‌లో శరదృ తువు పౌర్ణమి రోజున బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారని, సంస్కృత సాహిత్యంలో పేరెన్నిక గల కవి అని, ప్రసిద్ధ హిందూ ఇతిహాసం రామా యణం వెనుక సూత్రధారి అని, సంస్కృత సాహిత్యంలో మొట్టమొదటి కవి 'ఆది కవి' అనే బిరుదును కలిగి ఉన్నారన్నారు. వాల్మీకి మహర్షి శ్లోకమనే నిర్మాణ ప్రక్రియను కనుగొన్న మహా మహర్షి అని వారు కొనియాడారు. జీవీఎంసీలో వారి జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బిపిన్ జైన్, జివిఎంసి అదనపు కమిషనర్లు ఎస్.ఎస్. వర్మ, డి.వి.రమణమూర్తి, ఆర్. సోమనారాయణ , ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవ రెడ్డి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, డి.పి ఓ.ఎం,వి. డి.ఫణిరామ్, కార్యదర్శి బి.వి.రమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలనాయుడు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి...!

### ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు శిక్షణలో ఎంపీపీ బడుగు రమేష్



**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 17:** రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను, బాధ్యతలను సద్వినియోగపరుచుకోవడం ద్వారా గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని వార్డు మెంబర్లు, ఉప సర్పంచులను ఉద్దేశించి ఎంపీపీ బడుగు రమేష్ బాబు ఉపదేశించారు. రెండు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లకు ఎంపీడీవో మేరీ రోజ్ నేతృత్వంలో శిక్షణా తరగతులు ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ – గ్రామ అభివృద్ధికి, ప్రజా సేవకు స్థానిక ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు విడుదల, వాటి ఖర్చు, పంచాయతీలలో సమస్యలు తదితరాలపై వార్డు మెంబర్లు, ఉప సర్పంచులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల్లో, ప్రజలతో నిత్యం మమేకమై ఉండేందుకు వార్డు మెంబర్లు, సర్పంచులు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రపాలెం సర్పంచ్ పీట సింహాచలం, పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచులు,వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

**పంచాయతీ కార్యదర్శుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం:**

ఇదిలా ఉండగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభమైన ఉప సర్పంచులు, వార్డు మెంబర్ల రెండు రోజుల శిక్షణ తరగతులకు తొలిరోజు వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్లు ఆశించిన స్థాయిలో హాజరు కాకపోవడం పై ఎంపీపీ బడుగు రమేష్ అసహనం వ్యక్తం చేశారు. వార్డు మెంబర్లు, ఉప సర్పంచులు హాజరుకాని పంచాయతీలను గుర్తించి, ఆ పంచాయతీల కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఎంపీడీవో మేరీ రోజ్ ను ఎంపీపీ బడుగు రమేష్ ఆదేశించారు.

# అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా




- ఉపాధి హామీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా



**భీమిలి, పెన్ పవర్, అక్టోబర్ 17** ::రికార్డు స్థాయి మెజారిటీతో గెలిపించిన అమనాం సహా ఇతర గ్రామాలను అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఉపాధి హామీ పథకం కింద దాకమర్రి, బోడమెట్లపాలెం, అమ నాంలలో రూ.77 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం అమనాంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద మెజారిటీ ఇచ్చిన నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కట్టుబ డి ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో అభి వృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమి స్తున్నాయని చెప్పారు. రోడ్లు, డ్రెయిన్లు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాల న్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికీ కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. కూటమి నాయకులు కోరాడ రాజబాబు, రామానాయుడు,గాడు వెంకటప్పుడు, డి.ఎ.ఎన్.రాజు,గంటా నూకరా జు, ఎంపీడీఓ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి మోనటరింగ్ టీం సర్వే



కొయ్యూరు,బూదరాళ్ల, మర్రివాడ సచివాలయాల్లో సమావేశాలు

**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 17:** కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు కాబడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరుతెన్నులను అధ్యయనం చేసేందుకు గురువారం మండలంలో జాతీయస్థాయి మోనటరింగ్ టీం సభ్యులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా టీం లీడర్ సుధాకర్ నేతృత్వంలో ఏపీడి శ్రీనివాసరావు, చింతపల్లి ఏపీడి లోకేష్ మండలంలోని వెలుగు, ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు సిబ్బందితో కలిసి కొయ్యూరు, మర్రివాడ, బూదరాళ్ల గ్రామ సచివాలయాల్లో డ్వాక్రా మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు సచివాలయాల్లో వేరువేరుగా నిర్వహించిన సమావేశాల్లో టీం లీడర్ సుధాకర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, వాటర్ షెడ్ ద్వారా అమలయ్యే వివిధ పథకాలను సద్వినియోగ పర్చుకోవాలన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలను అధికారులకు దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రామ సభలను వేదికలుగా చేసుకోవాలని కోరారు. వెలుగు ద్వారా అందుతున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగపరుచుకుని డ్వాక్రా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. అలాగే సచివాలయాల సిబ్బందితో ప్రత్యేక సమావేశమైన టీఎస్ సభ్యులు, ఈ పథకాల అమలుకు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోలు శ్రీనివాస్, రాజు, వెలుగు ఏపిఎం గాంధీ, అలాగే ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, వాటర్ షెడ్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## కొయ్యూరు, రాజేంద్రపాలెంలో పల్లె పండుగ...!




**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 17:** గురువారం మండలంలోని కొయ్యూరు, రాజేంద్రపాలెం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కొయ్యూరు గ్రామంలో సాగిన జోగులు రైతు పొలంలో పల్లె పండుగ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, మొట్టడం వీరయ్యదొర, బీజేపీ నాయకులు మేడిబోయిన చక్రరావు, కూటమి నాయకులు అనిశెట్టి నాగేశ్వరావు, దుమంతి కిరణ్, ఉబ్బల రాజేష్, మరియు సచివాలయం సిబ్బంది పాల్గొని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులను ప్రారంభించారు. రాజేంద్రపాలెంలో ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్ పీట సింహాచలం, కూటమి నేతలు ఖాన్, వరహాలుబాబు, గూడెం లక్ష్మణ్, భావన సాయి జయంతి, సుధీర్ , కార్యదర్శి మౌనిక కమల, వి ఆర్పి బల్లప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొని రూ. 9 లక్షలతో స్మశాన వాటిక సీసీ రోడ్, గ్రామంలో మరొక సిసి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపనాలు చేశారు. ఈ సందర్భంగా ... పలువురు కూటమి నాయకులు మాట్లాడుతూ ... పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధిపదాన నడుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాజేంద్రపాలెం,వెలగలపాలెం లో వాల్మీకి జయంతి



**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 17:** గురువారం మండల కేంద్రంలోని రాజేంద్రపాలెం అంగన్వాడీ కేంద్రంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి యొక్క ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు కనకమహాలక్ష్మి, బాలమణి, కొండమ్మ, కార్యాలయ సిబ్బంది గుమ్మడి సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శి మౌనిక కమల, ఏఎన్ఎం రాజి, మహిళా పోలీస్ భవాని, రాజేంద్రపాలెం అంగన్వాడీ కార్యకర్త పివి రమణమ్మ తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**వెలగలపాలెం లో వాల్మీకి జయంతి :**

మండలంలోని వెలగలపాలెం గ్రామంలో సర్పంచ్ ఇరువాడ సత్యవేణి, వార్డు మెంబర్ సతీష్, రాంబాబు, కొండబాబు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్ శివ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గణపతి , జిఎస్ఎస్ సభ్యుడు నగేష్ తదితరుల ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# నాకు న్యాయం చేయండి....!

- నా వైకల్యాన్ని చూసి జాలి పడకపోయినా పర్లేదు....!
- నా బాధను వినే నాధుడే కరువయ్యాడు...!
- ఎక్కడికి వెళ్ళినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదు... !
- అని ఒక అంధుడి ఆవేదన




**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్, విశాఖపట్నం అక్టోబర్ 17. :** నేను ఒక అంధుడునని తెలిసి కూడా నన్ను పెళ్లి చేసుకోవడానికి అంగీకరించి. వివాహం జరిగిన కొన్ని నెలల తర్వాత నుంచి నన్ను వేధింపులకు గురి చేస్తూ.పక్కా ప్రణాళికతో నా ఉద్యోగం, ఆస్తి కోసం అంధుడు నైన నన్ను పోలీస్ స్టేషన్ లో నాతో నా కుటుంబ సభ్యులు కూడా ఇరికించి నరకం చేస్తున్నారని.విశాఖ ప్రెస్ క్లబ్లో తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సారెళ్ళ శ్రీధర్ (42) మాట్లాడుతూ నేను విశాఖపట్నం, హెచ్ బి కాలనీలో తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాని పుట్టుకతోనే అంధుడనని డిసెంబర్ 28, 2006లో కొత్తవలన చేదిన వెడువాక దేవుడు కుమార్తె వెడువాక వెంకట ధనలక్ష్మి నీ పెళ్లి చేసుకున్నానని కొంత కాలం సంసారం సాఫీగా సాగిపోతుందిని అయితే ఆమె వారి కుటుంబ సభ్యులు నా ఉద్యోగం, ఆస్తి చూసి పక్కా ప్రణాళికతో మోసం చేయాలనే ఉద్దేశంతో తన వైకల్యాన్ని అదునుగా చేసుకొని పెళ్లి చేసుకుని. ఆమె పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అయిన స్థానిక పోలీస్ స్టేషన్ లోకి వెళ్లిన అయిన కంప్లెయింట్ ను పోలీసులు తిసుకోవడం లేదని, అయిదారుసార్లు వెళ్లినప్ప టికీ పోలీసులు నా కంప్లైంట్ ను స్వీకరించలే దని ఒక అంధుడు నని కూడా పట్టించికొకుండా మరొక్కసారి పోలీస్ స్టేషన్ కు వస్తే ఇబ్బందులకి గురి చేస్తామని హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడికి వెళ్ళినా తనకి న్యాయం జరిగే అవకాశం లేని నేపథ్యంలో తమ గోడుని మీడి యాతో వెన్నవించుకొని తమకి తగిన న్యాయం చేయాలని. ప్రభుత్వం వెంటనే సహకరించి తమకు తగిన న్యాయం చేయాలని అందుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆవేదనను విన్నవించుకున్నారు.

## ఎంబి.పట్నంలో రెవెన్యూ సదస్సు.....




**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 17):** మండలంలో గల ఎంబి పట్నం గ్రామపంచాయతీ లో గురువారం రెవిన్యూ గ్రామ సభ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఏ వేణుగోపాల్ మాట్లాడుతూ రెవిన్యూ గ్రామాలలో గతంలో చొల్లంగి పాలెం గ్రామ రెవిన్యూ లో జరిగిన రీ సర్వేలో రైతులకు భూములు సరి చేయడం జరిగిందని వాటిలో ఏమైనా లోపాలు ఉన్నట్లయితే రైతులు ఫిర్యాదు చేసిన తదుపరి భూమి యొక్క సమస్యలు పరిష్కారం చేస్తామని తెలిపారు ఈ సదస్సుకు వచ్చిన రైతులు ఫిర్యాదులు అందజేశారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీటీసీ పల్లి బాపన్నాయుడు గ్రామ పెద్దలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తహాశీల్దార్ కు జిసిసి సెల్స్ మెన్లు సన్మానం.



**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్17:** కొయ్యూరు మండల నూతన తహాశీల్దార్ గా నియమితులైన తహాశీల్దార్ కుమారస్వామి ని మండల పరిధిలో పనిచేసే జిసిసి సెల్స్ మేన్లు,డీలర్లు,ఎస్ హెచ్ జి గ్రూప్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయనను దుశలువా తో ఘనంగా సన్మనించారు.మండలంలో ఉన్న 16 జిసిసి డిపోలు పరిధిలో పనిచేసే సెల్స్ మెన్స్ మరియు డీలర్లు లకు తహాశీల్దార్ సమావేశం నిర్వహించారు.ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యులు తమ డిపో కు సంభందించిన కార్డులు,స్టాక్ పాయింట్ పై తహాసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెల్స్ విషయం లో లబ్దరులకు ఎప్పుడు అందుబాటులో సరుకులు ఉండేలా చూడాలన్నారు. డిపోలు రెగ్యులర్ గా పనివేళల్లో తెరిచి ఎటువంటి పిర్యాదులు రాకుండా సర్వీస్ చేయాలని తహాశీల్దార్ కుమారస్వామి సూచించారు. ఈ సమావేశంలో నేరెళ్ళ బంద సెల్స్ మెన్ రంగారావు,తోపాటు పది డిపోలకు చెందిన సెల్స్ మెన్స్,డీలర్లు గంగరాజు,శ్రీనివాస్,సురబోయినచిన్నబాబు,లొవకుమార్,రాజు,అనస వాయ, సత్యవతి,సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం రెండవ మహాసభలు జయప్రదం చేయండి.



**అరకులోయ పెన్ పవర్ 17:**అల్లూరి జిల్లా అరకులోయ మండలం సుంకర మెట్ట పంచాయతీ దుక్కగూడ గ్రామంలో పార్టీ 2వ శాఖ మహాసభలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు వి ఉమా మహేశ్వర రావు మండల కార్యదర్శి కె రామారావు పాల్గొన్నారు.

డిశంబర్ 2 నుండి 4 వరకు జరిగే జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు.భవిష్యత్ లో గ్రామాల్లో వివిధ సమస్యలపై తీర్మానం చేశారు.

పివిటీజి పీఎం- జన్మన్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 2 లక్షల 39 వేయిలు ప్రస్తుతం పెరిగిన రేట్లు వలన ఇల్లు నిర్మాణానికి ఏ మూలకు సరిపోవువని

అలాగే గతంలో ఎన్.టి.ఆర్ రూరల్ హౌసింగ్ 2014 నుండి 19 వరకు ఉన్న పెండింగ్ లో ఉన్న ఇల్లు నిర్మాణాలకు కూడ గతంలో కేటాయించిన నిధులు నిర్మాణానికి సరిపోవు, ప్రతి ఇల్లు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 2లక్షల 39 వేయిలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగ 2లక్షల 50 వేయిలు అదనంగ పెంచి ఒక ఇల్లు నిర్మాణానికి 5లక్షల పెంచాలని,

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సిపిఎం నాయకులు గురువారం ఒక పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటా...!




- భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి
- నూతన తహాసిల్దార్ కుమారస్వామి

**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 17:** గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించేందుకు తన స్థాయిలో తన వంతు కృషి చేస్తానని నూతన తహసిల్దార్ కుమారస్వామి స్పష్టం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో ఇష్టాగోష్టి గా మాట్లాడుతూ - రెవెన్యూ గ్రామసభల్లో భూముల రీసర్వే పై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తానని, మండలంలోని 33 పంచాయతీల రైతుల నుండి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు తన వంతు పాత్ర పోషిస్తానన్నారు. విద్యార్థులకు వివిధ దృపత్రాల నిమిత్తం ఎటువంటి జాప్యం జరగకుండా చూస్తానన్నారు. అలాగే వచ్చే నెల 14 నుండి 33 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఆయన వివరించారు. అలాగే ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని, అలాగే వీఆర్వో, ఆర్ఐ తదితర సిబ్బంది ఎప్పటికప్పుడు ఇసుక రవాణాపై పర్యవేక్షణ చేస్తూ ఉంటారని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆర్ ఐ దొర, పలువురు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కణితి పాఠశాలను పరిశీలించిన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు :పల్లా






**గాజువాక: పెన్ పవర్,అక్టోబర్ 17:** కణితి పాఠశాలలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 ఇయర్స్ బాల బాలికల నెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా స్థానిక శాసనసభ్యుడు రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు . జీవీఎంసీ 87వ కార్పొరేటర్ బోండా జగన్నాథం టోర్నమెంట్ కు కావలసినటువంటి మౌలిక సదుపాయాలను మరియు అవసరాలను పై ప్రత్యేక దృష్టి సారించాలని పల్లాను కోరారు .ఈ టోర్నమెంట్ దిగ్విజయంగా పూర్తి చేయడానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని , జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలోనే సుమారు 300 స్కూళ్లలో అత్యధికంగా క్రీడల్లో రాష్ట్ర స్థాయి మరియు జాతీయ స్థాయికు కణితి పాఠశాల నుండి ప్రాతినిధ్యం వహించడం వల్ల 180 పాయింట్లు తో జిల్లాలోని ప్రథమ స్థానాన్ని కణితి పాఠశాల కైవసం చేసుకున్నందుకు స్థానిక శాసనసభ్యుడు శ్రీనివాసరావు విద్యార్థులను, పాఠశాల సిబ్బందిను ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో విజయరామరాజు, సత్తిబాబు, వర్రే రాంబాబు, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ,సూరిశెట్టి పెంటారావు, పోతల కృష్ణ,జాన్ రమేష్,భాగ్యలక్ష్మి, ఇందిరా ప్రియదర్శిని,దాలయ్య, మూర్తి,కళ్యాణ్ చక్రవర్తి, ఆదినారాయణ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# స్నేహ భావాన్ని పెంపొందించేవి క్రీడలే.

- ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ కుమార్.
- ఈతరం యువత క్రీడల పట్లమక్కువ చూపడం ఎంతో విశేషం.
- విజ్జిస్ అధినేత తాలశిల విజయ్ మోహన్.
- ఐపీఎల్ తరహాలో వి.ఎస్.పి.ఎల్.(వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్.)
- అట్టహాసంగా క్రికెట్ ఆటగాళ్లల వేలం.






**మధురవాడ పెన్ పవర్ అక్టోబర్ 17 :**స్నేహ భావాన్ని పెంపొందించేవి క్రీడలేనని విశాఖకు చెందిన యువత ప్రతిఒక్కరు సామాజిక స్ఫూర్తితో.. చెడు మార్గంలో వెళ్లకుండా క్రీడా స్ఫూర్తిని చాటడం శుభపరిణామమని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ కుమార్ అన్నారు. వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ చైర్మన్ బైబిల్ ప్రసాద్,వైస్ చైర్మన్ రాజేష్,అధ్యక్షులు నక్కాశ్రీధర్... ఆధ్వర్యంలో విశాఖ పోర్ట్ స్టేడియం వేదికగా నవంబర్ 23 నుండి 30వ తారీకు వరకు వారం రోజుల వరకు వి ఎస్ పి ఎల్ క్రికెట్ పోటీలకు సంబంధించి ఆటగాళ్ల వేలం గురువారం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ హెూటల్ లో నిర్వహించారు. ఈ వేలంలో ఆంధ్ర తెలంగాణ ఒరిస్సానుండి వివిధ కేటగిరీలలో సుమారు225 ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఈవేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు 8 ఫ్రాంచైజీలు మధురవాడ వారియర్స్,వెంకీ-11, పోలమాంబ-11,పివిఆర్ లయన్స్,మద్దిలపాలెం బ్లాస్టర్స్, మార్కాపూర్ వారియర్స్,వైజాగ్ వారియర్స్, హెచ్.ఆర్.ఏ.మావెరిక్.... క్రీడాకారుల వేలంలో పోటీపడ్డారు. పోటీలలో మొదటి స్థానం సంపాదించిన క్రికెట్ టీం కు 5లక్షలు, ద్వితీయ స్థానంకు 3లక్షలు, ఉత్తమ ప్రదర్శన క్రీడాకారుడు 50 వేల రూపాయలు... ప్రైజ్ మనీగా నిర్వాహకులు ప్రకటించారు. ఈసందర్భంగా ముఖ్య అతిధులు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ కుమార్, విజ్జిస్ అధినేత తాలశిల విజయ్ మోహన్,గోదావరి టైటిల్స్ హరీష్,మాట్లాడుతూ... ఈతరం యువత క్రీడల పట్లమక్కువ చూపడం ఎంతో విశేషమన్నారు.ఆరోగ్యవంతమైన ఆటలతో యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం శుభ పరిణామమని అన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రతినిధులను అభినందించారు.ఈ కార్యక్రమంలో వి.ఎస్.పి.ఎల్. ఉపాధ్యక్షులు అక్రమాని లోవరాజు, పృథ్వి కమిటీ సభ్యులు జగపతి నరేష్ పోలిమటి సునీల్ కుమార్..అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## కించవనిపలెం, కొయ్యూరు లో పొలం పిలుస్తుంది...!

రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న ఏవో ఉమాదేవి



**కొయ్యూరు ,పెన్ పవర్ అక్టోబర్ 17:**మండలంలోని కించవానిపాలెం కొయ్యూరు రైతు సేవ కేంద్రాల్లోమండల వ్యవసాయ అధికారిని ఉమాదేవి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఇందులో భాగంగా రైతులను ఉద్దేశించి ఏవో ఉమాదేవి మాట్లాడుతూ... వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాక్టీయల్ ఎండు తెగులు మరియు దోమపోటు గమనించడం జరిగింది. ఎండు తగులు సోకినప్పుడు మొక్కలు వర్ణంలోనికి మారి ఎండిపోవడం జరుగుతుంది నివారణ కు యూరియా వాడకూడదని సూచించడం జరిగింది వెయ్యాలని సూచించడం జరిగింది దోమ నివారణకు ఇమిడక్లప్రిడ్ 0.25 ఎం ఎల్ లీటరు నీటికీ కలిపి పిచికారి చేసి తగు నివారణ చర్యలు చేపట్టాలని రైతులకి సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో వెట్టనరీ డాక్టర్ రాజేష్ గారు పశువులకు సంబంధించి వాటి వ్యాధుల గురించి వివరించడం జరిగింది రైతులు గ్రామ సర్పంచులు వచ్చేనెల 15వ తారీకు కల్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారని ఆమె వివరించారు ఈ కార్యక్రమంలో సంబంధిత మంప గ్రామ సర్పంచులు త్రినాథ మూర్తి పడల్, మాజీ ఎంపీటీసీ శివరామరాజు రైతులును ఉద్దేశించి మాట్లాడటం జరిగింది ఈ కార్యక్రమం లో సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బంది విహెచ్ఎ లు ప్రభాకర్, వి ఏ ఏ రూప పాల్గొనడం జరిగింది

## డిగ్రీ కళాశాలలో పరిసరాల పరిశుభ్రత.




**అరకులోయ పెన్ పవర్ 17 :**అరకులోయ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం వారి సౌజన్యంతో కళాశాలలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కలిగిస్తూ క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా అనే అద్భుతమైన పెయింటింగ్ ను వేయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె భరత్ కుమార్ నాయక్ గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. తెలియజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటువంటి పెయింటింగ్స్ ద్వారా యువతలో మరింత స్వచ్ఛతా హి సేవా పై అవగాహన ఏర్పడుతుందని అన్నారు. కళాశాలలో తృతీయ సంవత్సరం బీఎస్సీ సిబిజెడ్ చదువుతున్న లోకోయి జగన్నాథం ఈ పెయింటింగ్ ను చిత్రీకరించినట్లు ఎన్ ఎస్ ఎస్ పిఓలు పి నాగబాబు ,వై విజయలక్ష్మి ,ఎం అనిత కుమారి తెలియజేశారు. విద్యార్థినికు ప్రిన్సిపాల్ అధ్యాపకులు, కళాశాల సిబంది అభినందించారు. ఈ కార్యక్రమంలో కే పుష్పరాజు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ పి కొండబాబు అధ్యాపకులు ఎల్ఎంఎస్ గణేష్ ,బి లచ్చన్న ,వి కామేశ్వరరావు ,ఎస్ అప్పారావు, కె సునీల్ , కె అంబికా, కె భవాని, ఎస్ దొన్ను,బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ నిర్మాణం పనులు వేగవంతం.

అరకు డివిజన్ గృహనిర్మాణ శాఖ డిఈ రాజుబాబు.



**అరకులోయ పెన్ పవర్ 17** :మండలంలో ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం గృహ నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి, సుంకరమెట్ట పంచాయతీలో సంఘం, డబుగూడ, పెద్దగంగగుడి పిరిబందా గ్రామంలో అరకు డివిజన్ గృహ నిర్మాణం డి ఈ. రాజుబాబు, అరకులోయ ఏఈ శెట్టి కాంతి గ్రామంలో సందర్శించి లబ్ధిదారులకు గృహ నిర్మాణం వేగవంతం చేయాలని ఒక పత్రిక ప్రకటనలు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ డి ఈ రాజుబాబు మాట్లాడుతూ సుంకరమెట్ట పంచాయతీలో సంఘం వలస గ్రామంలో సందర్శించామని, గృహ నిర్మాణం లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకుందామని, గృహ నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అరకులోయ మండల వ్యాప్తంగా నూతనంగా 2166 గృహాలు మంజూరయ్యాయని, మొదటి విడత 1404 గృహాలు నిర్మాణం చేపట్టదలుచుకున్నామని, అలాగే రెండవ విడత 762 గృహ నిర్మాణాలు చొప్పున నిర్మాణాలు చేపడతామని ఆయన తెలిపారు. నిరుపేద గిరిజనులకు ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం ప్రవేశపెట్టిందని, ఒక గృహ నిర్మాణానికి 2లక్ష 39 వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, గృహ నిర్మాణం చేపట్టిన మొదటి వారం రోజుల్లోనే బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందని, మంజూరైన ప్రతి ఒక లబ్ధిదారులు నూతన గృహ నిర్మాణాలు ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పి వి టి జి లకు ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం గృహ నిర్మాణాలు మంజూరు చేస్తుందని, మంజూరైన గృహాలకు నిర్మాణం అవకాశాలను ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శెట్టి కాంతి, ఈఏ.మజ్జి నాగేశ్వరరావు. సుంకర్ మెట్ట సర్పంచ్ చిన్నబాబు, గ్రామస్తులు గృహ నిర్మాణ వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

## కారు బోల్తా.. ఒకరు మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 17:**ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన గురువారం ఆంధ్ర ఒడిస్సా సరిహద్దుల్లో చోటు చేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలం, వనుగుమ్మ పంచాయతీ అసరాడ గ్రామ సమీపంలో కారు బోల్తా పడి ఒకరు చనిపోగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అసరాడ వైపు నుండి డుడుమ వైపు వెళ్ళుచున్న (ఓడి 10 బి 7622 నంబరు గల) కారు అసరాడ సమీపంలో బ్రేకులు ఫెయిలయ్యి అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకు వెళ్లిందని, ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి అన్నారు. స్థానికులు ప్రైవేటు వాహనంలో క్షతగాత్రులను ఒడిస్సాలోని లంతపుట్టు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో డ్రైవర్ గొనియ ఉమ్మ మరణించాడని, ముగ్గురికి లంతపుట్టు ఆశకిరణం ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. ఒడిస్సా రాష్ట్రంలోని బోయిపరిగూడ ప్రాంతానికి చెందిన వారిగా క్షతగాత్రులు అన్నారని స్థానికులు తెలిపారు. ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయహుండీ లెక్కింపు



**నర్సీపట్నం, పెన్ పవర్ (అక్టోబర్ 17)** :నర్సీపట్నంలో శ్రీదుర్గా మల్లేశ్వరి దేవాలయంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉత్సవకమిటీ సమక్షంలో పోలీసులు బందోబస్తు మధ్య హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో భాగంగా దేవీ నవరాత్రులలో టికెట్ల ద్వారా 5.57 లక్షలు మరియు భక్తులు దర్శనానంతరం మొక్కుబడులుగా సమర్పించుకున్న హుండీ ఆదాయం 5,95,089/- లు లెక్కించడం జరిగిందని ఈవో సాంబశివరావు తెలిపారు.

## మెగా డిఎస్సీ ఆదివాసీలకు దగా డిఎస్సీ కాబోతుంది:ఆదివాసీ పార్టీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 17:**మెగా డిఎస్సీ ఆదివాసీలకు దగా డిఎస్సీ కాబోతుందని ఆదివాసీ డిఎస్సీ ఉద్యోగాభ్యర్థులు పోరాటానికి సిద్ధంకండని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు పిలుపు నిచ్చారు.ఆ ంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచార సమయంలో డిఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీ ప్రకారం మెగా డిఎస్సీ ఫైల్ పైన మొదటి సంతకం చేసారు.అదే ఎన్నికల సమయంలో అరకు,కురుపాం లలో చంద్రబాబు నాయుడు జిఓ 3ని తీసుకొస్తామని,అవసరమైతే కోర్ట్ కు వెళ్తామని హామీ ఇవ్వడం జరిగింది.మెగా డిఎస్సీ ఫైల్ మీద సంతకం పెట్టిన చంద్రబాబునాయుడు ఇంతవరకు జిఓ 3 గురించి మాట్లాడలేదు.నవంబర్ లో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.జిఓ 3 గానీ ప్రత్యామ్నాయ జిఓ గానీ లేకుండా డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే స్థానికి ఆదివాసీలకు రావాల్సిన 100 ఉద్యోగాలలో 6 ఉద్యోగాలు మాత్రమే వస్తాయి.మిగతా 94 ఉద్యోగాలు కోల్పోవలసివస్తుంది.ఈ విషయం పదేపదే చెప్తున్నాం.ఇప్పటికే డిఎస్సీ ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు పెట్టి కోచింగ్ తీసుకొంటూ ప్రిపేర్ అవుతున్నారు.మరోవైపు నోటిఫికేషన్ లో ఉద్యోగాలు ఉండవు.జనరల్ కోటాలో పోస్ట్ లకు పోటి పడాలి.అదే జిఓ 3 ఉండి ఉంటే షెడ్యూల్డ్ ప్రాంతంలో ఎన్ని ఉద్యోగాలు ఉంటే అన్ని ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే ఉండి ఉండేవి.జిఓ 3ని సుప్రీంకోర్ట్ రద్దు చేసిన తర్వాత జిఓ 3 స్థానంలో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియమకాల చట్టం తీసుకొని రావాలని ఆదివాసీలుగా మేం కోరుతున్నప్పటికి ప్రభుత్వం నిర్లక్షం చేస్తుంది.కూటమి ప్రభుత్వంలో ఉన్న ఆదివాసీ నాయకులు కూడా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొనిరావాలి.జిఓ 3ని రద్దు చేయించడానికి సుప్రీం కోర్ట్ వరకు వెళ్ళిన చేబ్రోలు లీలాప్రసాద్ కు కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన యూటిఎఫ్ వారు ఆర్థిక సహాయం చేసారు.సుప్రీం కోర్ట్ రద్దు చేసిన జిఓ 3 పునరుద్ధరించాలని అదే కమ్యూనిస్ట్ పార్టీ కి చెందిన అమాయక గిరిజన సంఘం అడగడం విడ్డూరంగా ఉంది.కమ్యూనిస్ట్ ల ద్వంద వైఖరిని ఆదివాసీలు పసిగట్టాలని,అలాగే మిగతా పెట్టుబడిదారీ పార్టీల వైఖరిని కూడా పరిశీలించాల్సిన అవసరం ఆదివాసీలకు ఉంది.ఆదివాసీ హక్కులు,చట్టాలను అక్రమంగా ఎలా ఉపయోగించుకోవాలోనని నాన్ ఆదివాసీ పార్టీలు,సంఘాలు చూస్తున్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు.

## బోర్ర మామిడి గ్రామంలో సర్పంచ్ సారాధ్యంలో పల్లె పండగ కార్యక్రమం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనాపల్లి పంచాయతీ బోర్రమామిడి గ్రామంలో స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణ సారాధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆగస్టు 23వ తేదీన నిర్వహించిన గ్రామసభ ద్వారా చేసిన పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా భూమి చదును, మొక్కల పెంపకం, కందకాలు, పశువుల షెడ్లు, కోళ్ల ఫారాలు మొదలగు అనేక పనుల ద్వారా లబ్ధిదారులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని కాబట్టి ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అలాగే ఎంత ఎక్కువ కూలి పనులు చేస్తే మెటీరియల్ కాంపౌండ్ ద్వారా మన గ్రామాలలో సిసి రోడ్లు డ్రైనేజీ తారు రోడ్లు మెటల్ రోడ్లు అంగన్వాడీ బిల్డింగులు మొదలగు అనేక పనులు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది అన్నారు. రాష్ట్రంలో 25 జిల్లాలకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సిసి రోడ్లు డ్రైనేజీ తారు రోడ్లు మెటల్ రోడ్లు సాంక్షన్ ఇచ్చినప్పటికీ అల్లూరి జిల్లాకు ఇవ్వకపోవడం చాలా బాధాకరమని కాబట్టి ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అల్లూరి జిల్లాకు కూడా నిధులు కేటాయించాలని కోరారు. గ్రామ సభ ద్వారా గుర్తించిన పనులనేది కచ్చితంగా పంచాయతీలకు ఇవ్వాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు సకాలంలో డబ్బులు జమ అవుతున్నాయి కాబట్టి అందరూ సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిలకమ్మా, పంచాయతీ కార్యదర్శి వెంకట శివలక్ష్మి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఈసీ శ్రీనివాస్, వీఆర్పీలు సత్తిబాబు, వివేకానంద దొర, వార్డ్ మెంబర్లు రాజేశ్వరి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువ చేసిన మహాకవి మహర్షి





### మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

### జయంతి కార్యక్రమంలో నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం అక్టోబర్ 17 :** మహా జ్ఞాని, తాత్వికుడు, సంస్కృతంలో రామా యణ మహా కావ్యాన్ని రచించి అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేసిన మహాకవి మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలు సుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. వాల్మీకి జయంతిని పురస్క రించుకొని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం నిర్వ హించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న జిల్లా కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ జీవితానికి అనువైన విధంగా వాల్మీకి రామాయణాన్ని రచించి ఎన్నో విషయాలపై మహత్తర సందే శాన్ని అందించారని గుర్తు చేశారు.కారణ జన్ము డిగా నిలిచిన ఆయన రామాయణం నిలిచినం త కాలం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, బీసీ సంక్షేమ అధికారిణి శ్రీదేవి, వాల్మీకి సంఘ నాయకులు, ఇతర అధికారులు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## కొత్తూరులో "పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు"





**-4 లక్షల 84 వేల రూపాయల నిధులతో పనులకు శ్రీకారం**

**-ముంచంగిపుట్టు ఎంపీడీవో శ్రీ సాయి హర్ష.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 17:**గ్రామాలలో అభివృద్ధి పనులకు అంకురార్పణ చేసే పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ సాయి హర్ష ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మండల పరిధిలో గల వనభసింగి పంచాయతీ కొత్తూరు గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు 4 లక్షల 84 వేల రూపాయలతో ఎంపీడీవో శ్రీ సాయి హర్ష, సర్పంచ్ వి లక్ష్మణ్ లు గురువారం ఖండిత కందకాలు ట్రెంచ్ వర్క్స్ పనులకు పూజా కార్యక్రమం నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఆగస్టు 23 తేదీన పంచాయతీలలో ఒకే రోజున గ్రామసభలు నిర్వహించి, ఆ సభల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు గ్రామాలలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను "పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు" పేరిట గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనుల్ని మండల పరిధిలో చేపడుతున్నమన్నారు. ఇందులో భాగంగా కొత్తూరు గ్రామంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధులు 4లక్షల 84 వేల రూపాయలతో ఖండిత కందకాల పనులు, మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించామన్నారు. పల్లె పండుగతో పంచాయతీ పరిధి గ్రామాలలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. రైతులకు ఉపయోగపడేలా పంట కుంటలు, పశువుల షెడ్డులు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాయుడు, కూటమినేతలు బలరాం, బాపూజీ, లక్ష్మణ్, చిన్ని బాబు, లతో పాటు ఎంజిఎన్ఆర్ఈజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దారకొండలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ పంచాయతీ కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు, గ్రామ పెద్దలు రాజు, గొర్లే గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కడూ రమణీయంగా అమ్మవారి రూపం లో దీపాలంకరణ

**గాజువాక:పెన్ పవర్ అక్టోబర్ 17:**జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి నిర్వాశిత కాలనీ వడ్లపూడి ఎన్టీఆర్ పార్క్ నందు శ్రీ దుర్గ గణేష్ యూత్ ఆధ్వర్యంలో దుర్గా దేవి నవరాత్రాలు నేటికి కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవారి ఆకృతి లో దీపాలనకరణ కార్యక్రమం నిర్వహించారు. ముందు గా అమ్మవారి కి స్థానిక కార్పొరేటర్ బోండా జగన్నాధం పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు అనంతరం సాయంత్రం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారి ఆకృతి లో ఏర్పాటు చేసిన దీపాలంకరణ అందరిని ఆకట్టుకుంది.ఈ కార్యక్రమం లో దుర్గా గణేష్ యూత్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## పడవ ప్రమాదంలో యువకుడు మృతి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 17.**ముంచంగిపుట్టు మండలం, దారెల పంచాయతీ పెద్దపేట గ్రామానికి ఆనుకొని ఉన్న మత్స్య గెడ్డలో నాటు పడవ ప్రమాదంలో కోర్ర వేణుగోపాలస్వామి (25) అనే యువకుడు గల్లంతయ్యారు. స్థానిక ఎస్సై కే రవీంద్ర, మండల తహసీల్దార్ నర్సమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. పెదబయలు మండలం, సీతగుంట పంచాయతీ, రోగులపేట గ్రామానికి చెందిన యువకుడు వేణుగోపాల స్వామి పనిముట్లు పదును పట్టించేందుకు పెద్దపేట గ్రామానికి తీసుకొని వెళుతుండగా మత్స్యగేడ్డ మధ్యలో నాటు పడవ మునిగి మృతి చెందాడు. సమాచారం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకుని ఎస్సై తహసీల్దార్ ల ఆధ్వర్యంలో మృతదేహం కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలుపుదల చేసి శుక్రవారం మరల యధావిధిగా గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలియజేశారు . మృతుడు వ్యవసాయ పనిముట్లను పదును చేయించుకునేందుకు గురువారం ఉదయం 9 గంటల సమయంలో స్వగ్రామమైన రోగులపేట గ్రామం నుండి నాటు పడవ సహాయంతో పెద్ద పేట గ్రామానికి వెళుతున్న తరుణంలో మత్స్యగెడ్డ మధ్యలో నాటు పడవ మునిగి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండడంతో అగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మద్యం షాపుకు మధ్యవర్తులు





### "టిడిపి నాయకులు"

### ప్రశ్నించిన విలేఖరి పై నాయకుల బెదిరింపులు

### 13 వ వార్డు టిడిపి లో ఆ ఇద్దరిదే హవా, పార్టీకి తలనొప్పిగా మారిన వారి తీరు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబర్ 17:** తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీలో లాస్ట్ బస్ స్టాప్ వద్ద గల ప్రభుత్వ మద్యం దుకాణానికి సమీపంలో జీవీఎంసీ నిర్మించిన గోడ ను ఆనుకుని ఉన్న ఒక్క ఇంటి నిర్మాణ సమయంలో వాణిజ్య సముదాయం కోసం రెండు షాపులను నిర్మించారు. వాటి ప్రవేశం కోసం జీవీఎంసీ గోడను పడగొట్టి షాపులకు ప్రవేశాలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా జీవీఎంసీ గోడను తీసివేయడంతో అధికారులు జివిఎంసి సిబ్బంది గోడను పునర్ నిర్మించారు.ఇప్పుడు ఆఇంటిని వాణిజ్య సముదాయంగా మార్చి రెండు దుకాణాలను నిర్మించి రోడ్డు వైపు ప్రవేశద్వారాలు పెట్టేందుకు వీలుగా జీవీఎంసీ వారు నిర్మించిన రక్షణ గోడను కూలగొట్టి దారిని ఏర్పరచుకున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో నూతన మద్య పాలసీని అమలు చేయడంతో ఇప్పుడు ఆ షాపులో ప్రయివేటు మద్యం షాపు పెట్టి అమ్మకాలను కొనసాగించేందుకు వీలుగా స్థానిక టిడిపి నాయకులు మధ్యవర్తులుగా వారి సహకారాలు అందజేస్తూ ఏర్పాటును కొనసాగిస్తున్నారన్నది స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా షాపులు విషయమై పెన్ పవర్ రిపోర్టర్ ఫోటోస్ తీసేందుకు వెళ్లగా ఒక వర్గం టిడిపి నాయకులు అడ్డుకొని బెదిరింపులకు పాల్పడ్డారు. ఫోటోలు తీసేవి ముందు మమ్మల్ని వివరాలు అడగాలి కదా మీ ఇష్టం వచ్చినట్టు ఫోటోలు తీస్తారా చూస్తాం అంటూ అక్కడి నుండి వెళ్లిపోయారు. ఏర్పాట్లు చేస్తున్నారు. 13వ వార్డులో కొంతమంది టీడీపీ నాయకులు తమ అబ్బా కొనసాగిస్తూ విలేకరుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారు. షాపులు నిర్మాణంలోఏ విధమైన ప్లాన్ లేకుండా ఇల్లు నిర్మించి ఆపై కమర్షియల్ గా వ్యాపారాలు చేసుకునేందుకు జీవీఎంసీ రక్షణ గోడను కూలగొట్టి మద్యం వ్యాపారాలకు అణువుగా మలుచుకోవడంతో స్థానికులు వ్యతిరేకిస్తున్నా,,, నాయకుల తీరు కలవరపెడుతున్నాయి. ఇంత జరుగుతున్న స్థానిక సచివాలయ సిబ్బంది పట్టించుకోకపోవడం, సచివాలయ సిబ్బందిని కూడా శాసించే నాయకుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. జీవీఎంసీ రక్షణ గోడను యధాతథంగా నిర్మించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విలేకరులపై బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టి, సంబంధిత అధికారులు నిర్మాణానికి షాప్ కు నిర్వహణకు అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

